


## స్నిగ్ధంగా, స్వచ్ఛంగా, మనోహరంగా కన్పిస్తున్నాయి చూపువేటు దూరంలో విశ్వవిద్యాలయ భవనాలు.

కాంతిని కుప్పబోసి రూపాలుదిద్ది తీర్చినట్లు, కౌముదీ నదిలో ముంచి తేల్చినట్లు, పాల మీగడతో వెల్లవేసినట్లు వెలిగిపోతున్నాయి ఆ భవనాల చతురస్రాకార శిఖరాలు. చల్లని ఉదయపు గాలి. ప్రశాంత వాతావరణం. పచ్చని తివాచీలా పరుచుకొన్న పరిసరం. చిగురాకుల చిరునవ్వులు; సూర్యకిరణాల నులివెచ్చని స్పర్శకు వివశత్వం చెందుతూన్న పువ్వులు.

ఆ పచ్చగడ్డి పరకలపై 'మార్నింగ్ వాక్'లో చకచకా నడుస్తూ ప్రొఫెసర్ చంద్రకాంత్. ఆయన నడకను అందుకోటానికి దాదాపు పరుగెత్తినట్లుగా నడుస్తూ ప్రొఫెసర్ శ్యామల :

''అబ్బ... కొంచెం నెమ్మదిగా నడవ రాదూ...'' బేలగా అంది శ్యామల.

''వేగంగా నడిస్తేనే, చేస్తున్న పనికొక అర్థం, సార్థకత్వం'' అంటూ, నిలబడి శ్యామల వైపు చూశారు ప్రొఫెసర్ చంద్రకాంత్. ఆ చూపులో రాగభావనతో నిండిన వాత్సల్యం, స్మృతి పరిమళాలను వెదజల్లే కరుణభావం.

ఆమె గుండెలు ఉచ్ఛ్వాస నిశ్వాసలతో ఎగసిపడుతున్నాయి. కళ్ళల్లో తారట్లాడే అలసత్వం.

''ఈ చిన్ని శ్రమకే తట్టుకోలేని శిరీష పుష్పం మా శ్యామలమ్మ; అహ, ప్రొఫెసర్ శామలమ్మ'' స్వరతరంగాలు ప్రవహించిన చంద్రకాంత్ మాటల మేళవింపుతో, శ్యామల హృదయం రాగరంజితమైంది కన్నుల్లో అపూర్వమైన వెలుగు. చంద్రకాంత్ ఒక సిమెంట్ బెంచీని కర్చీఫ్‌తో శుభ్రపరిచి కూర్చొన్నాడు. ప్రేమతరంగాలపై తేలియాడుతూ వచ్చే అనంత కరుణామయిలా వచ్చి చంద్రకాంత్‌కు అభిముఖంగా మరో సిమెంట్ బెంచీమీద కూర్చొంది శ్యామల. తపస్సు ఫలించి వరస్వీకారం జరిగినట్లు, జన్మాది అన్వేషణకు తగ్గ ఫలితం సాక్షాత్కరించినట్లు, మనోజ్ఞంగా, నిర్మోహంగా ఉందామె మనస్సు. ఒక్కక్షణం ప్రొఫెసర్ చంద్రకాంత్ వైపు తేరిపార జూసింది శ్యామల. ఆయనలో కాలం తెచ్చిన మార్పు ఆశ్చర్యం కలిగించినా, ఆమెలోనూ ఏదో అనుభూతి శాలుకు అందమైన కలవరం'' మిగుల పండిన విజ్ఞాన రేఖలతో హృద్యంగా వెలిగిపోతున్న నుదురు వయో ధర్మ పరిణామానికి ప్రతిరూపంగా తలపై అక్కడక్కడ పాయలు పాయలుగా నెరిసిన జుట్టు; రెండు చెంపలపైనా తెల్లబడ్డ వెంట్రుకలు, పూర్ణత్వంతో వెలిగిపోయే మనసు; పరిశోధనా సమాధిలో ముద్రాంకితుడైనట్లు ఆ వదనంలో తల్లీనత, ప్రజ్వలత; తలపండిన అనుభవం తాలూకు ప్రశాంత గంభీరత''

''మొత్తానికి చంద్రకాంత్‌ని బలంగానే ఆకట్టుకొంది కాలం'' అనుకొన్న శ్యామల మనసు క్షణకాలం శ్రుతి తప్పినట్లు కలవరపడింది. ఆయన సాన్నిధ్యంలో తానేదో యోగ సమాధిలో లీనమై ధన్యమైనట్లు, స్ఫూర్తితో ఉద్వేగం పొందీ క్రమేపీ నిశ్చల ప్రశాంతతలోకి, నిశ్శబ్దం

లోకి, జన్మ జన్మల నుండీ వెన్నాడుతూ వచ్చే అమృతమూర్తి దర్శనంలో లోతుల్లోకి వొదిగి పోతున్నట్లు అన్పించసాగింది శ్యామలకు

''శ్యామలా...,శాస్త్రిగారికి విమ్మళించిందా? రాత్రి వద్దామనుకొన్నాను. కాన్ఫరెన్స్ నుండి వచ్చేప్పటికే బాగా పొద్దుపోయింది'' శ్యామల కన్నుల్లో చిరుకోపం అందించిన అలక తాలూకు ఛాయలు పెదాలు వత్తిపట్టే చంద్రకాంత్ వైపు చూసింది.

''అరెరె ... ఈ తెలుగింటి ముద్దబంతికి ఇంతలోనే కినుక ఏమిటో?'' ఆత్మీయత, ఆప్యాయత అంతర రూపం ధరించాయి చంద్రకాంత్ పలుకుల్లో.

''ఎంత రాత్రైనా నిన్ను చూడందే నేను నిద్రపోనని నీకు తెలియదా? నాన్న గూడా ఎన్ని సార్లు జ్ఞాపకం చేశారో; జ్ఞాపకం చేసినప్పుడల్లా నీ క్వార్టర్స్‌కు రావటం, నిరాశతో వెనుదిరిగి రావటం ... '' శ్యామల మాటల్లో లీలగా నిష్ఠూరం; నిరాశతో నిండిన అలజడి.

సర్దుమణిగి కరిగిపోయిన ఏవో తీపికలలు తిరిగి ఊపిరి నింపుకొని కళ్ళముందు తారట్లాడి నట్లైంది చంద్రకాంత్‌కు. ఆ సంతోషంలోనే అన్నాడు.

''శ్యామలమ్మ ప్రొఫెసర్ గారికి రాత్రి ''వాకింగ్ ఎక్సర్‌సైజ్'' బాగా అయిందన్న మాట.''

''నీకు హాస్యంగానే ఉంటుంది. నీ ఆలోచనల్లోనే లీనమైపోయిన నా మనసుపడ్డ ఆర్తి, ఆవేదన నీకేం తెల్సు'' ఆమె మాటల్లోని విషాద స్పందన చిందించిన నిట్టూర్పులసవ్వడి సూటిగా చంద్రకాంత్ హృదయాన్ని తాకింది.

''సారీ'' అంటూ శ్యామలవైపు ఆరాధనగా చూశాడు; ఆ అనుభూతి అతని కెంతో అద్భుత మనిపించింది. వికసించిన పువ్వు మళ్ళీ పాదలోకి దొరలుకున్నట్లు, తేజస్వంతమైన ఆమె ముఖం ముకుళించుకుపోయింది. ఆ కళ్లల్లో చెలరేగే నల్లని మబ్బునీడలు.

ఈ తుఫాను ఈ భక్తుణ్ణి మన్నించమని నా ప్రియదేవతను మనసారా వేడుకుంటున్నాను'' రెండు అరచేతులు ఏకం చేసి దీనంగా మొఖం పెట్టి అభినయించిన చంద్రకాంత్‌ను చూసి ఫక్కున నవ్వింది శ్యామల. ఆమెకు ఈ స్థితి పారవశ్యాన్ని కల్గించింది. ఈ రాగ మురళీ రవళులు కాలం స్పృశించ లేనంతగా ఆరోహణం చెంద చిరంజీవులై ఉన్నాయన్న విషయం ఆమె గుండెను మధురిమం జేసింది.

''ఆ... అట్లా ఉండాలి. దెన్ యూ ఆర్ ఏ నైస్ గర్ల్''

''గరల్... నేనా ? ఆంగ్ల ప్రొఫెసర్‌గారికి వయోధర్మాలు వంటపట్టలేదులా ఉంది''

''అదేనోయి... మంచి అమ్మాయివి అని... అరెరె...అమ్మాయీ అని అనగూడదులా ఉంది, మరి ఏ విధంగా శబ్ద ప్రయోగం చేయాలో నీవే చెప్పాలి; తెలుగు ప్రొఫెసర్‌వి గదా''


''నేను అమ్మాయినేమిటే; అమ్మమ్మ వయసొస్తుంటే...'' అంటున్న శ్యామల గొంతులో ఎన్నెన్ని వాయులీనపు మధుర నాదాలో!

''మరి నాకు తాతయ్య కళలొస్తున్నాయా? నోనో... నేనొప్పుకోను – అప్పుడే మూలకు నెట్టి నోరు నొక్కి కూర్చోబెడితే; ఈ ఘటం అవిశ్రాంతిగా. కాలంతో పోటీపడి పరుగెత్త వలసిందే. లేదా; కాలాన్నే స్తంభింపజేస్తాను ఏమనుకొన్నావో చంద్రకాంత్ అంటే'' మురిపెంగా అంటున్న చంద్రకాంత్ కళ్ళల్లోకి చూస్తూ ఉండిపోయింది శ్యామల. అమె మనసులో వెన్నెలమ్మ ముస్తాబవుతోంది. ఆమె కళ్ళల్లో అనంతకోటి నక్షత్రాల చిరుచిరు ప్రభల ప్రతిరూపాలు. ఆమె నరాల్లో సవ్వడి జేసే మమతానురాగ లలిత స్వరాలు.

''ఈ మనిషి ఆనాడూ ఇంతే..., అనురాగానికీ. ఆత్మీయతకు సజీవ వ్యాఖ్యలా ..., శ్యామలా; ఈ సృష్టిలో ప్రేమ అపూర్వమైంది అమూల్యమైంది. ప్రేమింపబడటం మహనీయమైన వరం. ఇహ ఆరాధింపబడడమనేది...... దానికి వ్యాఖ్యానం చేసే శక్తి నాలో లేదు. ఈ మనిషిలో ఎంతటి ఆప్యాయత; ఎంతటి స్నేహ మాధుర్యం కిరీటం పెట్టుకొంది. ఈ స్నేహ పరిమళం తన బ్రతుకులో ఎన్నెన్ని మందారాలు పూయించింది; ఎన్నెన్ని ముద్దు ముచ్చట్లకు పందిళ్ళు వేసింది! వయసు పలవరింతలు లేని వలపు కలవరింతలు వేసికొన్న పందిళ్ళు అవి. ఈ మనిషి అంతరంగంలో స్థావరం ఏర్పర్చుకోటానికి ఆ స్త్రీకి ఎన్నో వరాలు, అర్హతలు కావాలి'' రాగార్ద్రమైన భావాలతో శ్యామల గుండెలు ఊగిసలాడాయి. ''ఈ అదృష్టం అందరికీ అందదు'' తనలో తను అనుకొంటున్నట్లుగా శ్యామల. ప్రశాంతమైన పరిసరాల్ని తదేకంగా చూస్తూ ఉన్న చంద్రకాంత్ దృష్టి యథాలాపంగా శ్యామల వైపుకు మళ్ళింది. ఆ చూపు కొన్ని క్షణాలు అట్లాగే నిల్చిపోయింది. ఒకనాటి అమాయకత్వం, స్నిగ్ధత్వం, ముగ్ధత్వం, ప్రౌఢత్వం ఈ అవస్థలన్నింటినీ దాటిన వయోధర్మ మార్పులు ఆమెలోనూ పొడ చూపినై. కళ్ళ కింది కాంతులు తరిగిపోయి, నలుపు, నీలం రంగు కలగిలిపిన లోయలు; నల్లని మబ్బు గుండెల్లో స్థిరంగా ఉండిపోయిన మెరుపు తీగల్లా, కాలపు కత్తి వాతెర దెబ్బల్ని తెలియ జేస్తూ ఆమె తలలో వెండి వెంట్రుకలు. ఆమె వయసూ జీవిత పరిమాణపు ఉత్తరార్ధంలోకి వెళ్ళిపోయినట్లు, సుకుమార దేహపు శోభలు అంతరించి వృద్ధాప్యఛాయలు పొటమరిస్తున్న శరీరం; ఎన్ని మార్పులు తేగలిగినా ఆ కళ్ళల్లోని పసిడి వెన్నెల తళుకులను స్పృశించటంలో వైఫల్యం చెందింది కాలం. ఎదలో లోతుల్లో నుండి ఆమె పట్ల ఆరాధనాభావం పొంగుకొచ్చింది. ఆ కుందనపు బొమ్మ వేపే మరింత ఆరాధనతో, ఆర్తితో చూశాడు చంద్రకాంత్. అణువణువూ అనురాగ చందనగంధపు పరిమళాల్లో మునిగి తేలినట్లు, అమర భావాల కోవెల గంటల గణగణ ధ్వనుల ఆత్మీయతా అలరింపులు, ఆశీస్సుల ప్రవాహంలో అలౌకిక దివ్యానుభూతిలో లీనమైనట్లు. ఏవేవో జన్మ వాసనల వెలికి తీతలో తాదాత్మ్యం పొందినట్లు, అద్భుత రీతిలో మౌన, ప్రశాంత ముద్రాంకితయై కూర్చుండిపోయిన శ్యామలను జూసి చంద్రకాంత్ కన్నుల్లో అపూర్వమైన వెలుగు.

''శ్యామూ...''

ఆ పిలుపులోని ఆర్ద్రతకు, అభయముద్రా దర్శనానికి ఉలిక్కిపడి చంద్రకాంత్ వైపు చూసింది శ్యామల. యోగ సమాధి నుండి మేల్కొని శంకరుణ్ణి చూసిన పార్వతీదేవి హృదయంలా, శ్యామల హృదయం గూడా యుగయుగాల వియోగం నుండి బయటపడి తన ఇల



వేలుపుని చేరుకొన్నంత సంబరంతో నిండి పోయింది శ్యామల హృదయం ఇప్పుడు ఇల్లాలు భావానికి పవిత్రతలోగిలి

''వెళ్దామా శ్యామూ''

ఎత్తిపట్టిన శ్యామల ఎడమ చేయి చిటికిన వేలిని అందుకొన్నాడు చంద్రకాంత్, శ్యామల మురిపెంగా లేచి నిలబడింది ఇరువురూ వెను దిరిగారు సాంద్రతర వలపు ప్రసారానికి శరీరాల దూరం ఒక అభ్యంతరం కాదన్నట్లు ఒక గుండె లోని మమత, ఆత్మీయత మరో గుండెలోకి ప్రసారమైంది. నడుస్తూ అడిగాడు చంద్ర కాంత్,

''నాన్నగారికెట్లా ఉందో చెప్పలేదు''

''రాత్రి కొంతసేపు బాగానే నిద్ర పోయారు. ఈ పక్షవాతానికి కేరళలో మంచి ఆయుర్వేద వైద్యముందట''

''ఇంకేం, వచ్చే నెలారంభంలో నేనెట్లాగూ త్రివేంద్రం వెళ్తున్నాను. ముగ్గురం కలిసే వెళ్దాం'' శ్యామల కళ్ళల్లో అభివందన చిహ్నలు. అ చిహ్నల్లో జన్మజన్మల నుండీ తీగసాగిన బంధాల సప్తవర్ణరాగాలు ''సమన్వయం, ఎదలో లోతుల్నుండి చిమ్ముకొచ్చే స్పందన, రాగలాల సత్యం వీటికి ఆలంబనం దొరటమేకాదు, వీటినిసమంగా అర్థం చేసుకొని ప్రతిస్పందించగల సాహచర్యం లభించినప్పుడే స్త్రీ, పురుష జన్మలు సార్థక మయ్యేది, చరితార్థమయ్యేదీను'' చంద్రకాంత్ సన్నిధిని, ఆ సన్నిధిలోని ఆత్మబంధపు జొన్న త్యాన్ని జొదల, అభిషిక్తం చేసుకొన్న శ్యామల అంతరంగం పలికిన భావాలే ఇవి. ఇంటికి జేరిన శ్యామల మనసు పొరలనుండి జ్ఞాపకాల స్మృతులు పునరావృతమవుతున్నాయి.

*　　*　　*

ఆ రోజు 'బి.యే' స్పెషల్ తెలుగు విద్యార్థు లకు రుక్మిణి కళ్యాణం పాఠం చెప్తున్నారు రామ శాస్త్రిగారు విద్యార్థుల్లో వింత ఉత్సాహం; ఏదో తెలియని ఉద్వేగం రామశాస్త్రిగారు పాఠంలో లీనమైనారు. పరవశంలో మూర్ధాభిషిక్తు లవుతూ .., ''అమ్మా...రుక్మిణమ్మా.. ఎంత గడుసుదనం, తెంపరితనం చూపెట్టావు తల్లీ, నల్లనయ్య, మురళీ గోవిందుడు, ఆ వలపు వసం తాల రసరాజు రావటమే తడవు, పిలవటమే ఆలస్య మన్నట్లు రథమెక్కి వెళ్ళిపోయావు మబ్బుల మధ్య మెరుపు తీగెలా, అయినవారు, కళ్ళల్లో వత్తులు వెలిగించుకొని కనిపెంచినవారూ ఎవరూ గుర్తుకు రాలేదా తల్లీ'' భక్తిభావంతో రామ శాస్త్రిగారి హృదయం ఒక తీర్థపు మడుగే అయింది. మహాసాధ్వి రుక్మిణమ్మలోనూ ఇంత వలపు భావం, ఇంత తెగింపు, నమ్మశక్యంగావటం లేదు ఆయనకు

రామశాస్త్రిగారు సంస్కృతాంధ్ర భాషల్ని క్షుణ్ణంగా తరిచి తరిచి అధ్యయనం చేసిన పండి తులు. బ్రహ్మవర్చస్సుతో వెలుగొందే వదనం మేలిమివన్నె ఛాయ; నుదుటిపై ఆ కొస నుండి ఈ కొస దాకా, వ్యాపించిన విభూతి త్రిరేఖలు, నొసట కుంకుమ, చూసేవారికి అబ్బురంతో పాటు, అంతరంగంలో నమ్రతను, గౌరవాన్ని కలిగిస్తాయి. అల్లరికి అలవాటుపడి, ఆకతాయిగా తిరిగే విద్యార్థులు గూడా ఆయన క్లాసులో కిమ్మనరు. ఆయన మధురమైన బోధన, విద్యార్థులకు జ్ఞానామృతభాండం అందించినట్లే ఉంటుంది. ఈ రుక్మిణీ కళ్యాణం వాళ్ళకు మరీ రసభరితంగా ఉంది

శ్యామల గూడా తండ్రి చెప్తున్న పాఠంలో లీనమై ఉంది. ఆ లేత హృదయంలోనూ చిత్ర మైన సందడి. యధాలాపంగా ప్రక్కకు మళ్ళిన శ్యామల దృష్టి ఒక్క క్షణం మంత్రించినట్లుగా నిల్చిపోయింది. సమ్మోహనకరాలైనా ఆ రెండు కళ్ళు... ఆ కళ్ళలోని ఆరాధన, అభ్యర్థన...తనను ఆకట్టుకోజూస్తున్న ఆ కళ్ళలోని వెలుగురేఖలు... తొట్రుపడింది శ్యామల. భయం, బిడియం, ఆశ్చర్యం, అబ్బురం, గగుర్పాటు...ఆమెచూపులు నేలకు వాలిపోయాయి. పగడపు మొగ్గల్లాంటి పెదాలు అల్లల్లాడినై; కనురెప్పల తాడనలో శృతి జారింది. తలవంచుకొనే అసంకల్పితంగా తిరిగి అటువైపు చూసింది. శ్యామల ఎదలో వెన్నెల


**ఆంధ్రపత్రిక**

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగువారికి సేవ చేస్తోంది.

**విజయవాడ, హైదరాబాద్‌ల నుండి వెలువడుచున్నది.**

తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలకి ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.

**ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు !**

★ మన సినిమాలు　★ డాక్టరు కబుర్లు　★ కలైడోస్కోపు కార్టూన్
★ దినవారఫలాలు　★ వర్లైసీమ　★ శ్రీకృష్ణ భాగవతం
★ ఇదివారీ దృక్పథం　★ యుద్ధకాండ　★ వింత యథార్థం

★ ఇంకా — వ్యాసాలు, గేయాలు, కార్టూన్లు ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము.

**వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి !**

పూసిన పులకరింత. మనసులో పన్నీటిచిలకరింతల పలువరింత. అతని చూపు తన శరీరంలోని ప్రతి అణువునూ స్పృశించి, లాలనతో పరామర్శించి, తిరిగి పరావర్తితమై అతన్నే చేరుతూంది. అతని కన్నుల్లో ఆనంతమైన వెలుగు. పెదాలపై దర హాస కాంతులు. హృదయవీణ తీవెలను ఎవరో సుతారంగా సవరించినట్లు, సప్త వర్ణాల హరివిల్లును మీటి సుస్వరాలు ఆలపించినట్లు ఆమె ఎదలోనూ గిలిగింతలు; పులకరింతలు; అబ్బ...ఎంతసేపూ ఆ చూపు...; ఎందుకో ఆ చూపు...; ఆమె చెక్కిళ్ళు కనకాంబ రాలై. అంటుగోరింట పూతలై ... ఆమె తల వంచుకొన్నది. తండ్రి "రుక్మిణీ కళ్యాణం" పారం సాగిపోతూనె ఉంది.

ఆ రాత్రంతా ఆ చూపు ఆమెను వేటాడు తూనే ఉంది. ప్రేమ వాహినిలో వేడుక తీరా తన్ను ముంచెత్తుతూనేఉంది; ఆచూపులో ఎంత ఆకర్షణశక్తి... తపస్సు ఫలించినట్లు తనలో ఎంత తృప్తి... ఎందుకట్లా చూశాడు...అప్పుడే విరిసి విప్పారిన కమలంపై, రాగచంద్రికలు ప్రవహించినట్లు, వసంతంకోసం తపించి తపించి తల్లడిల్లిన కోకిల, ఆ వసంతాగమన పారవశ్యంలో పంచమ స్వరంలో పల్లవికి ప్రాణం పోసినట్లు, శూన్యంలో పూర్ణత నిండినట్లు ఏవో తెలియని వింతస్పందనలు అంతరంగాన్ని అల్లరి పెడు తూంటే ఒత్తిగిల పడుకొని గట్టిగా కళ్ళు మూసుకొంది శ్యామల.

క్లాసులో ఆ మరునాడు, ఆ మరోనాడు, ఆ తర్వాత ఆవే చూపులు; ప్రణయదేవతకు ఆత్మార్పణ చేసుకొంటున్నట్లున్న ఆ చూపులు తనను బలంగా తాకటంతో శ్యామలకు తత్తర పాటు కలిగేది. జన్మ తరించినట్లనిపించే మరేదో తృప్తి. ఆ చూపుల్లో ఎన్ని సందేశాలో; ఎన్ని రాగాత్మల ప్రణయ ప్రవాహాలో! ఆ చూపుల్లోనే తను అభిషిక్తురాలవుతున్నది. ఇట్లా ఒక మాసం గడిచింది. రెండోమాసంలో పరస్పర పలుకరింపులు; అనుగ్రహ సంస్పర్శనలు; అరమోసిన కన్నుల తన్మయావస్థలు.

"శ్యామలా నిన్ను ఆరాధిస్తున్నాను. నా జీవన ప్రాంగణంలోకి కరుణించి వచ్చిన దేవత పట్ల చూపే ఆరాధన ఇది."

"అబ్బ... ఆ గొంతులో ఎంత ఆర్తి, అర్థింపు; వలపు తరంగాల వింత తపన"

శ్యామల మనసులోని అనుభూతికి అక్షర రూపం ఇచ్చుకొంది.

"ఈ అర్చనకు, ఆరాధనకు ముగింపు అంటూ లేదు. మన వివాహం జరిగే మార్గం ఎట్లానూ లేదు. ఏదైనా మీ నాన్నగారి మాట విని వేరెవ్వరినైనా కళ్యాణమాడు; నా మనసంతా నిండిపోయిన నీ తీపి స్మృతులు చాలు నాకు" స్నేహవాత్సల్యాల మధ్య కరిగిపోతూ చంద్రకాంత్ గుండెల్లో ఏవో చక్రాల కోణాలు రాపిడి పెడుతున్నట్లు, ఈ ప్రకృతిలోని కలకలధ్వను లన్నీ. కొరివిదయ్యాల్లా పరవళ్ళ తొక్కుతూ అట్టహాసం చేస్తున్నట్లు, చుక్కలు రాలిపడు తున్నట్లు అన్పించింది శ్యామలకు.

"శ్యామూ ... నాకోసం నీ జీవితాన్ని శూన్యం చేసికోవద్దు..."

"నా పిచ్చి చంద్రా ..., ఈ నిరీక్షణ, నీకోసం నాకోసంగాదు; మనకోసం. ఏ భావన కైనా మనసే భూమిక; కళ్యాణం, తాళిబొట్టు, తలంబ్రాలు ఇవి స్త్రీ పురుషుల కలయికకు బాహికమైన ఉపచారాలు మాత్రమే; ఆ ఇద్దర్నీ జన్మజన్మలకూ కలిపి ఉంచే అంతస్సూత్ర బంధం మరొకటి ఉంది. అది — ఏడడుగుల మించిన ఆత్మీయతా బంధం. ఈ బంధానికి వివాహమే పరమావధి అని నే ననుకోను; ఈమన అనుబంధం, ఆప్యాయత. ఎన్ని జన్మల నుండి మనల్ని ఆశీర్వదిస్తూ వస్తున్నదో; ఈ బంధం కాలాన్నిదాటి, ఉదాత్తంగా, అతిలోకంగా ఉండి పోవాలన్నదే నా తపన, ఆరాటమూను; నీకోసం నీ పలుకు కోసం నా ప్రతి అణువూ తహతహ లాడుతుంది; తపించిపోతుంది. నీ సమక్షంలోనే ఈ నా జీవితం గడిచిపోవాలన్నదే నా ఆశ." సిగ్గుతో, వివశత్వంతో శ్యామల కళ్ళు అరమోడ్పు లైనాయి; ఆ స్వాప్నిక పాలనిదుర అనుభూతిలో ఆమె మనసుదీపకళికయై ఎన్నెన్ని ఆలయాలలో హారతిని వెలిగించి వచ్చిందో;

"శ్యామూ...పై చదువులకు నేనుదూరంగా వెళ్తే."

శ్యామల ఒక్క క్షణం చంద్రకాంత్ వైపు చూసింది.

"నా నుండి నీవు దూరంగా వెళ్లేదెట్లా? నా గుండె గుడిలోనే ఆశీర్వదిస్తూ ఉండి పోయావుగా."

"శ్యామూ ..." అమృత స్పర్శలై తాకిన శ్యామల మాటలకు అతని గుండెలోని వేదనా మబ్బులు చీలికలు పేలికలైపోయాయి. ఒక మహాద్భుతమైన కాంతి అతని ముందు తళుక్కు మంది. ఆ కాంతి స్థిరమై, నిశ్చలమై అతని మనసంతా నిండి, హృదయమంతా నిండి, ఒక సృష్టి దరహాసాన్ని, జీవన సత్యాన్ని తనకు చెప్పి నట్టు అతని శరీరం రాగిభావంతో పరిమళ భరిత మైంది. వెన్నెల తరగవంటి స్వచ్ఛమైన, వ్యామోహ రహితమైన ప్రేమ భావం అతన్ని హృద్యంగా స్పర్శించింది. "శ్యామూ ఈ మను గడను ఎంత సార్థకం చేశావు" అంటున్న అతని కళ్ళు సంబరంతో వెలిగిపోయాయి.

ఆ రాత్రి రామశాస్త్రిగారు భాగవత పారా యణంలో లీనమై ఉన్నారు.

"నాన్నా"

"ఏమిటి తల్లీ ?"

తలొంచుకొని తన మనసులోని సంశయాన్ని ఎట్లా తెలియజెప్పాలో తెలియక తల్లడిల్లుతున్న శ్యామల అవస్థను ఆయన తృటిలోనేగ్రహించారు


"ఒకవేళ కృష్ణుడు రుక్మిణి కోరికను మన్నించక పోయినట్లైతే?" ఈహఠాత్ప్రశ్నకు రామశాస్త్రిగారు మొదట నివ్వెరబోయారు. ఆ తర్వాత తేరుకొని..." ఎందుకు మన్నింపడమ్మా; రుక్మిణమ్మ తల్లికి మనసుంది. ఆ మనసు నిండా కృష్ణనామం; ఆమె మార్గం చూసుకొంది; అది కృష్ణధామం పైగా కృష్ణభగవానుడు లీలా మానుషుడు.

"మరి .. మరి ... రుక్మిణి చేసింది తప్పు కాదా; అట్లా పరపురుషునికి ప్రేమ లేఖలు వ్రాయవచ్చా?"

"తప్పని ఎవరన్నారమ్మా, స్వయంవరాలు ఆనాడు ఉన్నవే ఆమె వలచిందీ, పిలిచిందీ సాక్షాత్తూ భగవంతుణ్ణి."

"ఆనాడు తప్పు కానిది, ఈనాడెందుకు తప్పుగా భావిస్తారు నాన్నా ?"

"చూడు తల్లీ; ఈ ప్రేమలు, వివాహాలు ఆనాడూ ఉన్నాయి, ఈనాడూ ఉన్నాయి; విలు వలు కోల్పోతున్న నేటిమనిషి వాటి ప్రాశస్త్యాన్ని



పవిత్రతను నవ్వులపాలుజేసి, రచ్చబండ స్థాయికి దిగజార్చాడు. అందుకే నేటి యువతీ యువకులు కేవలం పై ఆకర్షణలకు భ్రమపడి, లోబడి, చేరువై, సమన్వయం కుదరక, దూరమై, శాప గ్రస్తుల్లా జీవించాల్సి వస్తున్నది. కాలాన్నిబట్టే నమ్మా, నిబంధనలు; కట్టుబాట్లూను ''

ఏదో మంచు పర్వతం తన చుట్టూ వల యాకారంలో పెరుగుతూవస్తున్నట్లు విలవిల్లాడి పోయింది శ్యామల. తన మనసులోని తపనను తల్లికి చెప్పుకొని ఉపశమనం పొందుదామంటే అ తల్లిగూడా తనకు దూరమైంది స్వర్గం నుండైనా తనకు తప్పక పంపుతుంది ఆశీస్సులు.

''నాకంతా తెల్సు తల్లీ.''

తండ్రి మాటవిన్న శ్యామల గుండెలు దడదడలాడాయి.

''చంద్రకాంత్ గుణవంతుడు ఆదర్శ వంతుడు; పైగా ధనవంతుడు. మన కులం గాని అతన్ని, నువ్వే ఏ మందో మాకో పెట్టి వల్లో వేసుకొన్నావని, ఆడి పోసుకొంటారు. శాస్త్రాలను అడ్డుపెట్టుకొని నాటకమాడానని నన్నూ మాటతూలతారు. అన్ని ధర్మాలకు కరువొచ్చిపోతున్న ఈ రోజుల్లోనూ మనం కాస్త నిర్భయంగా, నిబ్బరంగా జీవించగలుగుతున్నా మంటే అది మన పూర్వ జన్మ సుకృతమే అనుకోవాలి; మనసును సాంత్వన పరుచుకో తల్లీ''

వెక్కి వెక్కి వచ్చే ఏడుపును ఎంత ఆపు దామనుకొన్నా శ్యామలకు సాధ్యం కాలేదు. ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

''ఆడపిల్లవు; కళ్యాణం కావలసిన దానివి; కన్నీరు కార్చకమ్మా''

లాలింపుగా శ్యామల తల నిమురుతూ అన్నారు రామశాస్త్రిగారు. ఆ లాలింపులోనే మనసును కూడ గట్టుకుంది శ్యామల, ధైర్యాన్ని కూడ దీసుకొంది తాను...తాను .సాహసించాలి! తన బ్రతుకుకు ఏర్పడ్డ, చల్లనినీడను, అర్థాన్ని, గమ్యాన్ని పదిలపర్చుకోవాలి, లేదా జీవితం దుర్భర మవుతుంది. ఆనాడు రుక్మిణిదీ ఒక విధమైన తిరుగుబాటే, తన ప్రాణానికి మంగళ సంధానంగా మరో ప్రాణాన్ని సామరస్యంతో శృతి కూర్చు కోవటంలో తప్పులేదు, తప్పని సరి, ప్రకృతీ, ధర్మం ఎప్పుడూ ఒకటే; ఆచారాలు, అలవాట్లు మారినంతమాత్రాన ప్రకృతి మవులిక ధర్మా లెందుకు మారాలి ? నాన్నది పాప భీతి కాదు, లోకభీతి, ఆలోచనలతో ఒక నిర్ణయానికొచ్చిన ఆమె మనసు తేలిక పడ్డది

''నాన్నా''

''అడుగు తల్లీ''

''నేను 'యం ఏ' చదువుతాను.

ఒక్క క్షణం శ్యామల వైపు చూశారు రామశాస్త్రిగారు. ఆమె మనోభావాల్ని అర్థం చేసుకొన్నారు

''అట్లాగేనమ్మా, 'బి.ఏ.'లో పరిచయ మైన ప్రాచీన, ఆధునిక మహాకవులు సృష్టించిన విస్తృత సాహిత్య పఠనంతో నీ జీవితం ఉజ్వల మవుతుంది. ఆదర్శమవుతుంది.

''చాలు నాన్నా... ఈ దీవెన చాలు నాకు''

ఆ తర్వాత, శ్యామల, చంద్రకాంత్ ఒకే యూనివర్శిటీలో ''యం.ఏ'' చదివారు. వారి సబ్జక్ట్స్ వేరైనా ఇరువురి ఆలోచనా సరళి, చింతనాధార ఒకటే; ఆశయాలూ ఒకటే, ఒకరిని విడిచి ఒకరు ఉండలేరన్నంతగా అనుబంధం అల్లుకుపోయింది వారి మధ్య. అతనిసాన్నిధ్యంలో ఆమె కళ్ళు కమలాలే అయ్యేవి, ఆమె గుండెల్లో సన్నాయి సందళ్ళుగా అతని పలుకులు. చంద్ర కాంతిని మోసిమోసి పరిమిళాలను వెదజల్లుతూ ఊగిసలాడే పారిజాత తరువులా శ్యామల తనువు అతని ఆత్మీయతలో తన్మయావస్థను పొందేది.

''శ్యామూ, మనకు కొన్ని ఆశలూ, ఆలోచనలేకాదు ఆదర్శాలు, ఆశయాలూ ఉన్నాయి. వాటిని తీర్చుకోటానికి జీవితాలను అంకితం చేసికొందాం ఈ పవిత్ర యాగంలో ఒకరికొకరం సహకరించు కొందాం. కన్నుమూసి తెరిచేంతలో కాలం గడిచిపోతుంది'' చంద్రకాంత్ మాటలు ఆమెకు పూలజల్లులా అన్పించి పులకించిపోయింది ఇద్దరు యువతీ యువకుల సామీప్యంలో తన్నుకొచ్చే స్పందనలూ, అనుభూతులూ, ఆశలూ అవి శారీరక కలయికల తహతహకే పరిమితమనుకోటం అర్థం లేనిదన్పించింది శ్యామలకు. నిజమే; చంద్రకాంత్ చెప్పినట్లు కళ్ళు తెరిచేంతలోనే కాలం తరలిపోయింది అనుకొంది శ్యామల. ఇరువురూ డాక్టరేటు బిరుదులందుకొంటున్న సందర్భంలో; ఆ తర్వాత అదే యూనివర్సిటీలో ఇరువురూ అధ్యాపకులుగా ఉద్యోగాలు పొందారు. లెక్చరర్‌గా తనకన్నా ఒక రెండు నెలలు ముందే లెక్చరర్‌గా నియమింపబడ్డ చంద్రకాంత్ సన్నిధిలో ఉన్న శ్యామల కన్నుల్లో ఎన్నో మొక్కుబళ్ళు ప్రతిఫలించాయి. తన ఇలవేలుపు చంద్రకాంత్‌కు అర్పణ చేసుకోవటానికి, ఆరు ఋతువుల్ని, పంచభూతాలను తన కన్నుల్లోనే దాచుకొన్న శ్యామల కంటిపాపలు సృష్టికి కొత్త అందాలు అందిస్తున్నట్లుగా వెలిగిపోయాయి.



నేషనల్ బుక్‌ట్రస్టువారు ఇటీవల నవశిక్షితుల కోసం రచించిన పుస్తకాలకు ఢిల్లీలో అవార్డుల నిచ్చారు అందులో శ్రీమతి టి. శాంతాదేవి (హైదరాబాద్) రచించిన 'ప్రకృతితో చలగాటం' పుస్తకానికి ప్రథమ బహుమతిని విదేశీవ్యవహారాలమంత్రి శ్రీ పి. వి నరసింహారావుగారు అందచేస్తున్న దృశ్యం

''చంద్రా..., నేనెంత పుణ్యం చేసు కొన్నానో''

''నేనేనా, పాపం చేసుకొన్నది'' కొంటెగా, చిలిపిగా చంద్రకాంత్.

శ్యామల గంభీరంగా ఉండిపోయింది. చేతివాటు దూరంలో ఉన్న 'స్విమ్మింగ్‌పూల్' లో ఈతలేస్తున్న పిల్లల కేరింతల సవ్వడి, నీటి కలకలల శబ్దం రాపాడే చీర కుచ్చెళ్ళులా గాలి గాలి అలల మంద మంద ధ్వని,

''చంద్రా .. నీవూ నాలానే వివాహం చేసుకోకుండా ఉండిపోయావ్, నీ జీవితం గూడా ఏ అనుభూతి లేని శిలాసదృశంగా మారింది. ఇందుకు నేనేగా కారణం...'' శ్యామల గొంతు డగ్గుత్తిక అయింది; చెప్పలేని ఏదో క్షోభతో ఆమె హృదయం బరువెక్కింది.



"శ్యామూ... సృష్టిలో స్త్రీ పురుష సంబంధాలు కేవలం వివాహంతోనో, శారీరక బంధంతోనో పదిలంగా ఉంటాయనుకోవటం పొరపాటు. స్త్రీ, పురుషుల మధ్య సమన్వయం కుదరనప్పుడు, సహధర్మం కరువైనప్పుడు ఆ వివాహానికి అర్థం లేకపోగా; అదొక ట్రాజెడీ; నీవు నా ప్రక్కనుంటే నా హృదయం రాగ రంజితమవుతుంది; నీ సాన్నిధ్యంలో నా మనసు సప్తరాగాలతో సుస్వరాలను ఆలపిస్తుంది. నీలోనే గృహలక్ష్మిని, ప్రసన్నలక్ష్మిని చూసుకొనే వరం ఇచ్చి నీవే నన్ను కటాక్షించావు. మళ్ళీ మన మధ్య వేరే వ్యక్తి రాకూడదు; ఈ కోవెలలో ఆ వ్యక్తికి స్థానం దొరకదు" ప్రేమ వాహినులు ముంచెత్తిన ప్రశాంత అంతరంగ ప్రణయార్చనతో నిండి ఉన్న చంద్రకాంత్, ఆ సమయంలో శ్యామలకు తన జన్మాంతర తపస్సుకు సాక్షాత్కరించిన దైవమూర్తిగానే తోచాడు" నా జన్మ జన్మల ఆరాధ్యదేవతా; నీ కోసం ఈజీవితమంతా ముడుపు కట్టి, మరో జన్మకు నీ సాన్నిధ్యం కోసం ఈ ముడుపునే పవిత్రంగా పదిలపర్చుకొంటాను" అనుకొన్న శ్యామల హృదయంలో కోటిజ్యోత్స్నసరిత్తులు సుప్రతిష్ఠలయ్యాయి,

రామశాస్త్రిగారు శ్యామలకు లెక్చరర్ పోస్టు వచ్చిన తొలినాళ్ళలోనే రిటైరయ్యారు. ఇహలోక బాధ్యతలు తీరిపోయిన పూర్ణమనిషి. ఆయన; శ్యామల తరువాతి ఇద్దరాడపిల్లల వివాహం ఉన్నంతలో ఏ లోటూ లేకుండా జరిపించగలిగారు. తనకు ఆసరాగా, అండగా తండ్రిని ఒప్పించి తన వద్దకు తెచ్చుకొంది శ్యామల. ఒక విషయం గూర్చిన, వేదన. నైరాశ్యం రామశాస్త్రి గారిని క్రుంగదీస్తుండేవి; కొలిమిలా ఆయన మనసు క్షోభతో రగులుకుపోతుండేది. రుక్మిణమ్మ చేపట్టిన మార్గం పట్ల అంత పవిత్రత, పారవశ్య భావాలు ఏర్పడ్డ తనకు, అవే భావాలు తన కూతురు విషయంలో ఎందుకు పరాస్తమైనాయి! ఎందుకు అవరోధాలుగా కన్పించసాగాయి! తన కూతురు మనసారా మలుచుకోబోయిన మార్గానికి తానే అడ్డుకట్ట వేశానన్న భావం ఆయనను అదే పనిగా పట్టి పీడించసాగింది. ఎంతగా నెట్టివేసుకొందామన్న, ఎంతగా పరిపెట్టుకుపోదామన్నా సాధ్యపడని రీతిలో ఆ భావమే, ఆయనను సలపట పెట్టసాగింది. మానసికమైన ఈ వత్తిడి ఆయన శరీరాన్ని కృశింపజేయటమేగాక, పక్షవాతానికి గురిజేసింది.

రెండున్నర దశాబ్దాల కాలం అనంతకాల వాహినిలో అంతర్భాగమైంది. చంద్రకాంత్, శ్యామలలు అవివాహితులుగానే ఉండిపోయారు ... శ్యామల ఆలోచనలు గతంలో నుండి విడివడి వర్తమాన తీరాన్ని చేరుకొన్నాయి

ఇప్పుడు ... రాగరంజితమయ్యే తొలిసంధ్యలోనూ, కెంజాయికాంతుల విన్యాస స్పర్శలందించే మలి సంధ్యలోనూ ప్రొఫెసర్ చంద్రకాంత్, ప్రొఫెసర్ శ్యామల ప్రకృతికి ప్రియమైన నేస్తాల్లా, ఆరు ఋతువులు అందించే జీవనానుభూతుల ప్రతిరూపాల్లా, అనురాగ హారతులందించుకొంటూ సాగిపోయే మమతానుబంధ సంచారుల్లా ఇరువురూ కలసి, "వాక్" చేస్తారు; చర్చించుకొంటారు; ముచ్చటించుకొంటారు. యవ్వనం అందించే శారీరక అనుభూతులు, వయసులు ఆరాటపడే కోర్కెల పరవళ్ళు, ఎదలో ముగ్గుల ముద్రలువేసే కౌగిళ్ళు, ఆ అనుభవాలు, వాళ్ళకు లేకపోయినా, ఆ ఇరువురి హృదయాలు ఒకరినొకరు ఆరాధించుకొనే ధ్యానమందిరాలు. ఆ ధ్యానంలో ఎంతజ్వలన; ఆ ఆరాధనలో ఎన్నెన్ని వెన్నెల కాంతిలహరులు; ఎన్నెన్ని ప్రేమవాహినులు; మనువులకు అతీతమైన మనసు అందించే మధురమైన ఈ వాహినీ ప్రవాహం స్వచ్ఛమైంది. సృష్టికి ప్రియమైనదీను;

ఆ ఇద్దరి పరస్పర వాత్సల్యం, ఆత్మీయత, అర్చన, అర్పణ భౌతికభావ పరిధులు దాటి, శారీరక కామనలు అంతర్ముఖమై, ఆత్మానంద ప్రణయ జగత్తులో మగ్నమై, పంచభూతాల నీడలో పదిలమై, అనంత నిర్మల నిశ్చల వ్యాప్తమైన వెన్నెలమ్మ ఒడిలో సంగమమైనాయి; సార్థకమైనాయి. ★



తలలు రెండూ కలిసినప్పుడు
పేలకు లభిస్తుంది కొత్త నివాసం

స్కూలు గాని, ఇల్లు గాని, థియేటరు గాని కావచ్చు పేలు వ్యాపించెందటానికి ఇదే అవకాశం.
లైసిల్‌లో ఆల్కహాల్ లేదు
ఇతర పేల మందులవలే లైసిల్ ఇగిరిపోదు. ఇది మీ తల, జుట్టులో ఉండే తేమను, పోషణనిచ్చే ముఖ్యమైన నూనెలను లాగేసి జుట్టు పొడిగా, బిరుసుగా తయారయేలా చేయదు చుండ్రు పట్టనివ్వదు.
లైసిల్ ఆయుర్వేద పద్ధతిలో రూపొందించిన నూనెలు గలది
సువాసనచిందే లైసిల్ పేలనూ, ఈళ్ళనూ చంపివేసే పనేగాక తలకు, జుట్టుకూ పోషణను సమకూర్చి చుండ్రు పెరగకుండా చేస్తుంది.
ఎందరెందరో డాక్టర్లు లైసిల్ వాడమని సలహా ఇస్తారు.
సత్వరం సురక్షితం ఫలప్రదం




సుడొనిల్స్
లైసిల్
సుగంధిత పేల సంహారిణి
Expresso/SCI/80/TL

సుడొనిల్ కెమో ఇండస్ట్రీస్
గణేశ్ నగర్, చించ్‌వాడ్, పూనా-411 033

ఆపరేషను, ఇతర వైద్య చికిత్సలతో నిరాశచెందిన సోదర, సోదరీ మణులు అనేకులు మా సలహాలచే సంతానవంతులయి ఇచ్చిన యోగ్యతాపత్రములు గలవు.
మీకు బేబి/బాబు కావాలా



స్త్రీ. పురుష
సంధ్యాదోష నివారణా నిపుణులు.
వివరములు ఉచితం
పోస్టు ద్వారా చికిత్స గలదు.. ఈ మాస
ములలో స్వయముగా సంప్రదించుటకు

— తెనాలి —
గురువారం, ఆదివారం } మధ్యాహ్నం.. గం 12-00 నుండి సాయంత్రం. గం. 5-00 వరకు

— విజయవాడ —
మంగళవారం, బుధవారం, శనివారం } మధ్యాహ్నం. గం. 12-00 నుండి సాయంత్రం. గం 5-00 వరకు

శ్రీ నాగార్జున మూలికా కుటీరం
రామాలయం వీధి, తెనాలి 522 202.. * 2వ లైను కేదారేశ్వరపేట విజయవాడ-520 003..